క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గుంటూరు రూరల్: రోడ్ల విస్తరణ, విద్యుత్ శాఖలోని పలు ప్రాంతాల్లో మరమ్మతుల నేపథ్యంలో బుధవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని వినియోగదారులు గమనించాలని విద్యుత్ శాఖ అధికారులు మంగళవారం ఒక ప్రకటలో తెలిపారు. నగరంలోని డీ12 సెక్షన్ పరిధిలోని మిర్చియార్డు, అంకిరెడ్డిపాలెం, ఆదర్శనగర్, మహర్షి దయానందనగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు గమనించాలని తెలిపారు.

వీఆర్వోలు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

తహసీల్దార్ జియావుల్‌హక్



పొన్నూరు: స్మార్ట్ కార్డులు, అన్నదాత సుఖీభవ, కౌలు రైతు కార్డులు, కుల, ఆదాయ తదితర సర్టిఫికెట్లు సకాలంలో పూర్తి చేయాలని, విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ మహమ్మద్ జియావుల్ హక్ వీఆర్వోలను హెచ్చరించారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. గ్రామాల వారీగా పెండింగ్‌లో ఉన్న అర్జీలను తెలుసుకున్నారు. కొంతమంది వీఆర్వోల పనితీరు పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. అడ్డంకులు సృష్టిస్తూ సక్రమంగా పనిచేయకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో కార్యాలయ డిప్యూటీ తహసీల్దార్ ఆలేటి మాధవి, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రామారావు, సిబ్బంది పాల్గొన్నారు.

యూరియా మోతాదును తగ్గించాలి



పొన్నూరు: వరి సాగులో ధర తక్కువని 3 నుంచి 4 యూరియా బస్తాలు వినియోగిస్తున్నారని, 2 కట్టలు సరిపోతాయని మండల వ్యవసాయాధికారి ఆర్.వెంకటేశ్వరరావు అన్నారు. అధికంగా యూరియా వినియోగిస్తే పురుగు ఉధృతి పెరుగుతుందని, మళ్లీ వాటిని కట్టడి చేసేందుకు పురుగు మందులు వినియోగించాల్సి వస్తుందని తెలిపారు. మంగళవారం మండలంలోని కసుక్కర్రు, చింతలపూడి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. పంట పొలాలను సందర్శించి రైతులకు పలు సూచనలు చేశారు. అనధికారికంగా యూరియా నిల్వ చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ విస్తరణ అధికారి శ్రీకాంత్, సహాయకులు దుర్గమ్మ, రైతులు పాల్గొన్నారు.

తురకపాలెంలో బొడ్రాయికి ప్రత్యేక పూజలు



గుంటూరు రూరల్: అనారోగ్యాలకు గురై వరుస మరణాలతో బెంబేలెత్తుతున్న తురకపాలెం గ్రామ ప్రజలు ఇప్పుడిప్పుడే కుదుటపడుతున్నారు. వరుస మరణాలకు మెలియాయిడోసిస్ బ్యాక్టీరియా కారణమని కొందరు వైద్యులు తెలపగా, గ్రామంలోని ప్రజలలో బొడ్రాయి పూజలు, గౌతురాళ్ల నిర్మాణంలో అపోహలపై చర్చాంశనీయమైన సంగతి తెలిసిందే. గత వారం రోజుల క్రితం గౌతురాయిని ప్రత్యేక పూజలు చేసి సరిచేశారు. ఈ క్రమంలో మంగళవారం గ్రామంలోని బొడ్రాయికి కూడా ప్రజలు ప్రత్యేక పూజలు చేసి, నైవేద్యాలు సమర్పించుకున్నారు.

పెదనందిపాడు కళాశాలకు రూ.5 లక్షల విరాళం



నగరంపాలెం: పెదనందిపాడు ఆర్ట్స్, సైన్స్ కళాశాల అభివృద్ధి కోసం పూర్వ విద్యార్థి, ప్రముఖ పారిశ్రామికవేత్త(కాకుమాను) నల్లమోతు వెంకటరత్తయ్య రూ.5 లక్షల విరాళం అందించారు. మంగళవారం బృందావన్‌గార్డెన్స్‌లో కళాశాల అధ్యక్షుడు కాళహస్తి సత్యనారాయణకు అందజేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ పూర్వ విద్యార్థుల విరాళాలతో కళాశాలలో మౌలిక వసతులు కల్పిస్తామని అన్నారు. అనంతరం వెంకటరత్తయ్యను శాలువాతో సత్కరించారు. గతంలో ఇంటర్, బీకాం విద్యనభ్యసించగా, కళాశాల అభివృద్ధికి విరాళం అందించినట్లు వెంకటరత్తయ్య తెలిపారు.



కదం తొక్కిన అన్నదాతలు

వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు రైతు సమస్యల పరిష్కారం, ఎరువుల బ్లాక్ మార్కెట్‌ను అడ్డుకునేందుకు మంగళవారం తెనాలిలో చేపట్టిన అన్నదాత పోరు నిరసన కార్యక్రమంలో పొన్నూరు నియోజకవర్గం నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పోలీసులు అడుగడుగునా ఆంక్షలు సృష్టించినా, అడ్డుకునే ప్రయత్నం చేసినా మొక్కవోని ధైర్యంతో నిలబడ్డారు. –సాక్షి నెట్‌వర్క్



అన్నదాతకు అండగా నిలిచిన వైఎస్సార్‌సీపీ

పొన్నూరు: యూరియా లభించక తీవ్ర ఇబ్బందులు పడుతున్న రైతులకు వైఎస్సార్‌సీపీ అండగా నిలిచింది. వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు రైతు సమస్యల పరిష్కారం, ఎరువుల బ్లాక్ మార్కెట్‌ను అడ్డుకునేందుకు మంగళవారం అన్నదాత పోరు పేరుతో తెనాలిలో చేపట్టిన నిరసన కార్యక్రమానికి పొన్నూరు నియోజకవర్గం నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, రైతులు అధిక సంఖ్యలో తరలివెళ్లారు. వైఎస్సార్‌సీపీ పొన్నూరు సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ ఆధ్వర్యంలో పొన్నూరు, పెదకాకాని, చేబ్రోలు మండలాల నుంచి ద్విచక్ర వాహనాలపై ప్రదర్శనగా వెళ్లి నిరసన ప్రదర్శనలో పాల్గొన్నారు. పొన్నూరు వైఎస్సార్‌సీపీ కార్యాలయం నుంచి రాష్ట్ర మైనారిటీ కమిషన్ సభ్యులు షేక్ సైఫుల్లా, ఎంపీపీ భవనం పద్మలీల, ఉపాధ్యక్షుడు అంబటి రాఘవయ్య, నియోజకవర్గ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆకుల వెంకటేశ్వరరావు, సంయుక్త కార్యదర్శి అమిరినేని సాంబశివరావు, యువజన అధ్యక్షుడు చుండూరు వీరయ్య, రైతు విభాగం అధ్యక్షుడు ఆర్జీవీ ప్రసాద్, ఎంప్లాయీస్, పెన్షనర్ల విభాగం అధ్యక్షుడు చిర్ర అక్కిరెడ్డి, మండల అధ్యక్షుడు చింతలపూడి మురళీకృష్ణ, ఉపాధ్యక్షుడు సాపాటి శ్రీధర్, మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ మౌలాలి, మహిళా విభాగం అధ్యక్షురాలు మరియరాణి, ప్రచార విభాగం అధ్యక్షుడు తురిమెళ్ల రాజశేఖర్, రైతు విభాగం అధ్యక్షుడు శివరామ ప్రసాద్, సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు కట్టా సత్యం, నాయకులు షేక్ నాజర్, లంకపోతు పిచ్చిరెడ్డి, రుద్రపాటి నాగేశ్వరరావు, గోవర్ధన్‌రావు, చావాటి ఈశ్వరయ్య, సర్పంచి ప్రసాద్, పిల్లి మాణిక్యరావు, ఆర్.ఆదిశేషు, గేరా సంజీవ్, రమేష్, కొండమూడి లవకుమార్, కార్యకర్తలు ర్యాలీలో పాల్గొన్నారు.



తెనాలిలో నిరసన ప్రదర్శన ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న అంబటి మురళీకృష్ణ



పొన్నూరు నుంచి తరలివెళ్లిన వైఎస్సార్‌సీపీ నాయకులు

అడ్డుకునేందుకు యత్నం..

అన్నదాతకు అండగా నిలిచేందుకు వైఎస్సార్‌సీపీ తలపెట్టిన అన్నదాత పోరును అడ్డుకునేందుకు పోలీసులు ప్రయత్నించారు. తెనాలిలోని ఓ హోటల్‌లో పొన్నూరు వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణకు పోలీసులు నోటీసు ఇచ్చారు. కార్యక్రమంలో పాల్గొనవద్దని సూచించారు. మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు చింతలపూడి మురళీకృష్ణతో పాటు మరికొందరు నాయకులకు అన్నదాత పోరులో పాల్గొనవద్దని ఫోన్ల ద్వారా పోలీసులు సమాచారమిచ్చారు. అయినా అన్నదాత పోరు కార్యక్రమంలో అందరూ పాల్గొని రైతుకు అండగా నిలిచారు.

'అన్నదాత పోరు'కు తరలివెళ్లిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు

చేబ్రోలు: రైతాంగ సమస్యల పరిష్కారం కోసం వైఎస్సార్‌సీపీ పిలుపు మేరకు తెనాలిలో జరిగిన అన్నదాత పోరు కార్యక్రమానికి చేబ్రోలు మండలం నుంచి వైఎస్సార్‌సీపీ శ్రేణులు అధిక సంఖ్యలో తరలివెళ్లారు. ఖరీఫ్ సాగులో అన్నదాతలకు అవసరమైన యూరియా, ఎరువుల కొరత తదితర సమస్యలపై ఆర్డీవోకు వినతిపత్రం అందజేత కార్యక్రమానికి రైతులు, పార్టీ కార్యకర్తలు ద్విచక్ర వాహనాలు, ఆటోలలో భారీగా తరలివెళ్లారు. పొన్నూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ ఆధ్వర్యంలో చేబ్రోలు మండలంలోని అన్ని గ్రామాల నుంచి ఉదయం నుంచే తెనాలికి పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. ఎరువులు బ్లాక్ మార్కెట్టుకు తరలిపోతుండటంతో రైతులకు యూరియా సకాలంలో అందక అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. దీనిపై వైఎస్సార్‌సీపీ చేపట్టిన అన్నదాత పోరు కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు ఆళ్ల శ్రీరామిరెడ్డి, కూరాకుల ముత్యమేశ్వరరావు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు మన్నెం శిరీష, యర్రాకుల అనిత, మన్నెం వేణుగోపాలరావు, పరిశా చిరంజీవి, వీరాంజనేయరాజు, పూర్ణయ్య, ఎస్ఎస్, సుద్దపల్లి రాజేష్, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.



శలపాడు నుంచి అన్నదాత పోరుకు తరలివెళ్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

మన నిర్ణయాలపైనే మన భవిష్యత్తు ఉంటుంది

ఈగల్ ఐజీ ఆకే రవికృష్ణ

పెదకాకాని: జీవితం అంటే చాయిస్ కాదని మనం తీసుకునే నిర్ణయాలపై మన భవిష్యత్తు ఆధారపడి ఉంటుందని ఈగల్ టీం విభాగాధిపతి ఐజీ ఆకే రవికృష్ణ అన్నారు. మండలంలోని నంబూరు వాసిరెడ్డి వెంకటాద్రి ఇంటర్నేషనల్ టెక్నాలాజికల్ యూనివర్సిటీలో డ్రగ్స్ వద్దు బ్రో అంటూ మాదక ద్రవ్యాలు, ర్యాగింగ్‌పై నిర్వహించిన అవగాహనా సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అతిథులుగా గుంటూరు జిల్లా ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్, వీవీఐటీయూ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కొడాలి రాంబాబు, రిజిస్ట్రార్ డాక్టర్ వై.మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు. ఈ సదస్సులో ఐజీ ఆకే రవికృష్ణ మాట్లాడుతూ చెడు అలవాట్లకు యువత దూరంగా ఉండాలన్నారు. వాటి నుంచి బయట పడటం చాలా కష్టంతో కూడిన అంశంగా పేర్కొన్నారు. యువత తల్లిదండ్రుల మానసిక బాధను అర్థం చేసుకోవాలని వారి ఆకాంక్ష మేరకు మంచి భవిష్యత్తును కలిగి ఉండాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈగల్ విభాగం ద్వారా అనేక ఆపరేషన్లు చేపట్టామని ఆపరేషన్ సేవ్ క్యాంపస్‌ను ప్రారంభించి విద్యార్థులకు అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులు మత్తు పదార్థాల కదలికలు గమనిస్తే 1972 నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. మన్యం ప్రాంతాలలో గంజాయి సాగును కట్టడి చేసి రైతులకు ప్రత్యామ్నాయ పంటలు, ఉపాధి కల్పించామని తెలిపారు. గుంటూరు జిల్లా ఎస్పీ ఎస్.సతీష్ కుమార్ మాట్లాడుతూ డ్రగ్స్ కేసులలో ఎక్కువ శాతం 25 సంవత్సరాల యువత ఉండటం గమనార్హమని అన్నారు. హాస్టళ్లలో ఉండే విద్యార్థులు మాదకద్రవ్యాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. చెడు స్నేహాలతో యువత మత్తు పదార్థాలకు బానిసలవుతున్నారని, వాటికి ఎంత దూరంగా ఉంటే భవిష్యత్తు అంత ఉజ్వలంగా ఉంటుందన్నారు. అనంతరం ఐజీ రవికృష్ణ, ఎస్పీ సతీష్ కుమార్‌లను వీవీఐటీయూ వీసీ ప్రొఫెసర్ కొడాలి రాంబాబు, రిజిస్ట్రార్ డాక్టర్ వై.మల్లికార్జునరెడ్డి సత్కరించారు.



డ్రగ్స్‌కు వ్యతిరేకంగా విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయిస్తున్న ఈగల్ ఐజీ రవికృష్ణ, ఎస్పీ సతీష్‌కుమార్



అవగాహనా సదస్సులో అధ్యాపకులు, విద్యార్థులు

రైతు సంక్షేమాన్ని విస్మరించిన ఎమ్మెల్యే ధూళిపాళ్ల

వైఎస్సార్‌సీపీ పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ



పొన్నూరు: ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా రైతాంగం నష్టపోయి, ప్రస్తుతం వరి సాగుకు యూరియా లభించక నియోజకవర్గంలోని రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నా స్థానిక ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ పట్టించుకోవడం లేదని వైఎస్సార్‌సీపీ పొన్నూరు సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ విమర్శించారు. వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు అన్నదాతకు అండగా నిలిచే కార్యక్రమంలో భాగంగా తెనాలిలో అన్నదాత పోరు పేరుతో చేపట్టిన నిరసన కార్యక్రమం విజయవంతం కావడంతో ఆయన సమావేశంలో మాట్లాడారు. పొన్నూరులో యూరియా కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. సొసైటీలు, మార్కెట్‌యార్డ్ వద్ద తెల్లవారుజామున 4 గంటల నుంచి వందలాది మంది రైతులు బారులు తీరుతున్నారని తెలిపారు. ప్రస్తుతం అత్యవసరమైన యూరియా అందుబాటులో లేక రైతులు అవస్థలు పడుతున్నా ఎమ్మెల్యే నరేంద్రకు మాత్రం పట్టడం లేదని మండిపడ్డారు. స్థానికంగా ప్రజలు, రైతులకు ఇబ్బందులు కలిగితే పరిష్కరించాల్సిన ఎమ్మెల్యే అందుబాటులో లేకపోవడం సిగ్గుచేటన్నారు. తాను ఎమ్మెల్యేనని గ్రహించి రైతు పక్షాన నిలవాలని హితవు పలికారు. రైతు శ్రేయస్సు కోసం నిర్వహించిన అన్నదాత పోరు కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, రైతులతో కలిసి వచ్చి విజయవంతం చేయడం ఆనందాన్ని కలిగించిందని అన్నారు. వైఎస్సార్‌సీపీ నిరంతరం రైతు పక్షాన నిలుస్తుందని అన్నారు. నియోజకవర్గ ప్రజలు, రైతులకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అంబటి మురళీకృష్ణ అన్నారు.

ఏఎన్‌యూలో స్కిల్ కాంపిటీషన్‌పై అవగాహన

పెదకాకాని(ఏఎన్‌యు): వర్సిటీలో ఈసీ, ట్రిపుల్ ఈ బ్లాక్‌లోని ప్రొఫెసర్ వైఆర్ హరిగోపాల్ రెడ్డి సెమినార్ హాల్‌లో ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఇండియా స్కిల్ కాంపిటీషన్-2025పై అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 250 మంది విద్యార్థులు ఇంజనీరింగ్, ఎంసీఏ, ఎంఎస్‌సీ, ఎంబీఏ, ఎంకామ్, ఆర్కిటెక్చర్, ఫార్మసీ విభాగాల నుంచి పాల్గొన్నారని ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ ఆఫీసర్ డాక్టర్ ఎండీ తౌసిఫ్ అహమ్మద్ తెలిపారు. రిసోర్స్‌పర్సన్‌గా స్టేట్ కో ఆర్డినేటర్, నేషనల్ స్కిల్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్(ఎంఎస్‌డీసీ) కె.ప్రేమ్‌కుమార్ పాల్గొని అవగాహన ప్రజెంటేషన్ ఇచ్చారు. అలానే రిసోర్స్‌పర్సన్, స్కిల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ కె.సంజీవరావు, స్కిల్ డెవలప్మెంట్ కార్యక్రమాలను ఉద్దేశించి ఇండియా స్కిల్స్ కాంపిటీషన్ గురించి అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా డిజిటల్ కన్‌స్ట్రక్షన్, క్లౌడ్ కంప్యూటింగ్, సైబర్ సెక్యూరిటీ, మెకట్రానిక్స్ వంటి 63 స్కిల్ ట్రేడ్స్‌లో పాల్గొనవచ్చని తెలియజేశారు. ఈ పోటీలో పాల్గొనడానికి ఈ నెల 30 ఆఖరు తేదీగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా వీసీ ప్రొఫెసర్ కె.గంగాధర్‌రావు, రెక్టార్ ప్రొఫెసర్ రత్న శిలామణి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.సింహాచలం, సీడీసీ డీన్ ప్రొఫెసర్ వి.రవికుమార్, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సీహెచ్ లింగరాజుల చేతుల మీదుగా ఇండియా స్కిల్స్ కాంపిటీషన్ 2025 గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ కళాశాల అసిస్టెంట్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎం.గోపికృష్ణ, డాక్టర్ డి.చంద్రమౌళి, మహమ్మద్ రఫీ యూనివర్సిటీ స్కిల్ డెవలప్మెంట్ ఆఫీసర్, సీనియర్ మేనేజర్ శివరాం ప్రసాద్, పృథ్వి, అశోక్, ఇంజనీరింగ్ కళాశాల వివిధ విభాగాల అధిపతులు మెకానికల్ విభాగపు కో ఆర్డినేటర్ డాక్టర్ బి.పూర్ణచంద్రశేఖర్, ట్రిపుల్ ఈ కో ఆర్డినేటర్ డాక్టర్ ఉమామహేశ్వరి, ఈసీఈ కో ఆర్డినేటర్ డాక్టర్ డి.అఖిల జాన్, సీసీఎస్ఈ కో ఆర్డినేటర్ డాక్టర్ యు.సతీష్‌కుమార్, సైబర్ సెక్యూరిటీ కో ఆర్డినేటర్ డాక్టర్ కొండా చైతన్య, విద్యార్థులు పాల్గొన్నారు.



ఇండియా స్కిల్ కాంపిటీషన్ 2025 గోడ పత్రికను ఆవిష్కరిస్తున్న వీసీ ఆచార్య గంగాధరరావు తదితరులు

కులం పేరుతో దూషించిన వ్యక్తిపై కేసు నమోదు చేయాలి

కేవీపీఎస్ రాష్ట్ర కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి

పెదకాకాని: విధులు నిర్వహిస్తున్న పారిశుద్ధ్య కార్మికులపై అకారణంగా కులం పేరుతో తిట్టిన దానబోయిన వంశీపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) రాష్ట్ర కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి డిమాండ్ చేశారు. పెదకాకాని గ్రామంలో సోమవారం పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులపై కులం పేరుతో దూషించి, మహిళలపై దాడి చేసిన దానబోయిన వంశీపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని, కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ ఏపీ గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్, సీఐటీయూ ఆధ్వర్యంలో పెదకాకాని పోలీస్‌స్టేషన్ వద్ద మంగళవారం ధర్నా చేశారు. ఈ ధర్నాకు సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బి.లక్ష్మణరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మాల్యాద్రి మాట్లాడుతూ దళితులపై దాడులు జరుగుతున్నాయని, ప్రభుత్వం మరొకరిపై ఇటువంటి ఘటన జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రాజధాని ప్రాంతంలోనే పారిశుద్ధ్య కార్మికులకు, దళితులకు రక్షణ లేకపోతే మిగతా ఎక్కడ రక్షణ కల్పిస్తారని ఆయన ప్రశ్నించారు. ఘటన జరిగి 24 గంటలు పూర్తవుతున్నా పోలీసులు ఇప్పటికీ ఎఫ్ఐఆర్ చేయకపోవటం అనేక అనుమానాలకు తావిస్తుందన్నారు. పోలీసులు తక్షణమే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి, కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. గిరిజన సంఘం రాష్ట్ర నాయకుడు ఎ.అశోక్ మాట్లాడుతూ హక్కులను కాలరాసే విధంగా దాడులు జరగటం అన్యాయంగా ఉందన్నారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.లక్ష్మీనారాయణ, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎస్ శివాజీ, గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి చింతల శ్రీనివాసరావు, సీఐటీయూ మండల కార్యదర్శి రాజా రమేష్‌లు మాట్లాడుతూ కులం పేరుతో దూషించడమే కాకుండా, భౌతిక దాడి చేసిన వారికి శిక్ష పడే వరకు ఐక్యంగా ఆందోళన నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో కేవీపీఎస్ నాయకులు సంకూరి నీలాంబరం, బురదగుంట సాంబయ్య, పంచాయతీ వర్కర్స్ యూనియన్ నాయకులు ఆదిలక్ష్మి, కె.ఆనంద్, కె.రామారావు, వి.ఆవాజ్, రాజకుమారి, దాడిలో గాయపడిన పిచ్చమ్మను నాయకులు పరామర్శించారు. పెదకాకాని ఎస్సై మిరాజ్ నిందితుడిపై కేసు నమోదు చేస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. ముందుగా మంగళవారం ఉదయం 5:30 గంటలకు పారిశుద్ధ్య కార్మికులపై జరిగిన దాడికి నిరసనగా నిందితుడిపై కేసు నమోదు చేయాలని పెదకాకాని అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు.



పోలీసుస్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు, పారిశుద్ధ్య కార్మికులు

అంతర్ కళాశాలల క్రీడా పోటీలపై సమావేశం

గుంటూరు రూరల్: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం పరిధిలో ప్రతి సంవత్సరం జరుగుతున్న అంతర్ కళాశాలల క్రీడా పోటీలు విద్యార్థుల్లో శారీరక దారుఢ్యాన్ని పెంపొందించడంలో, క్రీడాస్ఫూర్తిని నింపడంలో, అలాగే రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రతిభను ప్రదర్శించేందుకు ఒక విశిష్ట వేదికగా నిలుస్తున్నాయని చలపతి ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్, ఏఎన్‌యూ జోనల్ కో ఆర్డినేషన్ కమిటీ చైర్మన్ ప్రొఫెసర్ డాక్టర్ నాదెండ్ల రామారావు తెలిపారు. మంగళవారం నగర శివారుల్లోని లాం నందున్న కళాశాలలో ఏఎన్‌యూ జోనల్ కో ఆర్డినేషన్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ చైర్మన్ మాట్లాడుతూ గుంటూరు, ప్రకాశం జిల్లాల్లోని విశ్వవిద్యాలయానికి అనుబంధ డిగ్రీ, పీజీ, ప్రొఫెషనల్ కళాశాలల నుంచి 32 మంది పీడీలు ఈ సమావేశానికి హాజరయ్యారన్నారు. సమావేశంలో 2025–26 విద్యా సంవత్సరంలో జరగబోయే క్రీడా పోటీల నిర్వహణకు సంబంధించిన అనేక అంశాలు చర్చించారు. మొత్తం 52 గేమ్స్ స్పోర్ట్స్ ఈవెంట్లకు సంబంధించిన ప్రొపోసల్స్‌ను ఏఎన్‌యూ జోనల్ కమిటీకి అందించారు. టోర్నమెంట్ ఖర్చులు, డైలీ అలవెన్స్‌లు ఇతర వ్యయాల కోసం నిధులను పెంచాలని డైరెక్టర్లు విజ్ఞప్తి చేశారు. ప్రతి సంవత్సరం జరుగుతున్న ఈ సమావేశం, క్రీడలలో విద్యార్థుల భాగస్వామ్యాన్ని పెంచడమే కాకుండా, విశ్వవిద్యాలయ పరిధిలోని కళాశాలల మధ్య సమన్వయాన్ని బలపరచడంలో కీలక పాత్ర పోషిస్తుందని నిర్వాహకులు పేర్కొన్నారు. కళాశాల స్థాపన నుంచి ప్రతి సంవత్సరం 2-3 క్రీడా పోటీలను నిర్వహించి విద్యార్థులను ప్రోత్సహిస్తున్నామని, రాబోయే రోజుల్లో విస్తృత స్థాయిలో పోటీలు నిర్వహించి ప్రతిభావంతులైన విద్యార్థులను రాష్ట్ర, జాతీయ స్థాయికి తీసుకెళ్లే లక్ష్యాన్ని కొనసాగిస్తామని ప్రిన్సిపాల్ తెలిపారు. క్రీడలు వ్యక్తిత్వ వికాసానికి పునాది అవుతాయని, విద్యతో పాటు క్రీడలకు సమాన ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరాన్ని నిర్వాహకులు ప్రస్తావించారు. రాబోయే రోజుల్లో ఈ సమావేశంలో తీసుకునే నిర్ణయాలు విద్యార్థుల క్రీడా భవిష్యత్తుకు దిశానిర్దేశం చేస్తాయని చలపతి విద్యాసంస్థల అధినేత వైవీ ఆంజనేయులు తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, పీడీలు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న సభ్యులు, పీడీలు

ప్రజా వైతాళికుడు కాళోజీ జయంతి

లక్ష్మీపురం: తన జీవిత కాలంలో జరిగిన ప్రతి ఉద్యమాన్ని ఊపిరి మార్చుకుని వాటిలో తమ వంతు పాత్రను చురుగ్గా పోషించిన కాళోజీ నారాయణరావు రాజ్యం మీద అక్షరాయుధాలను గురి చూసి సంధించిన ప్రజా వైతాళికుడని రచయిత్రి జర్నలిస్టు పింగళి భాగ్యలక్ష్మి అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో మంగళవారం కాళోజీ నారాయణరావు జయంతి నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలుగు, హిందీ, ఉర్దూ, మరాఠీ, కన్నడ, ఆంగ్ల భాషల్లో కవిగా ఆయన సుప్రసిద్ధులని, సమకాలీన సమాజంపై ఆయన ప్రభావం అపారమైనదన్నారు. సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, మేధావుల ఫోరం కన్వీనర్ పి.ఎస్.మూర్తి మాట్లాడుతూ ఒక సిరా చుక్క లక్ష మెదళ్లకు కదలిక అంటూ ఆలోచనా జ్యోతులను వెలిగించిన కాళోజీ ప్రజల పక్షం వహించిన కవిగానే కాదు, ప్రజాకాంక్షలను ఎలుగెత్తిచాటిన అసలు సిసలైన ఉద్యమ కారుడిగా ఖ్యాతిగడించారన్నారు.

నారాకోడూరు జీడీసీఎంఎస్ పాయింట్ తనిఖీ

సాక్షి ఎఫెక్ట్

చేబ్రోలు: చేబ్రోలు మండల పరిధిలోని గ్రామాల్లో యూరియా, కాంప్లెక్స్ ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఏవో ప్రియదర్శిని తెలిపారు. మంగళవారం సాక్షిలో ప్రచురితమైన 'యూరియా కొరత.. రైతుల వ్యథ' కథనానికి స్పందించి మండల పరిధిలోని నారాకోడూరులోని జీడీసీఎంఎస్ పాయింట్‌ను ఆమె తనిఖీ చేశారు. యూరియా నిల్వలు రైతులకు సక్రమంగా పంపిణీ చేయాలని నిర్వాహకులకు సూచించారు. మీ చెంతకే యూరియా పేరుతో అన్ని గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాలకు అందజేస్తున్నట్లు ఏవో తెలిపారు. యూరియా కొరతపై అపోహలు వీడాలన్నారు. రైతులకు అవసరం మేరకు యూరియా ఉందని, ఇప్పటి వరకు 1,400 మెట్రిక్ టన్నుల యూరియా పంపిణీ చేసినట్లు తెలిపారు. మండలంలో 5,300 హెక్టార్లలో వరి, 700 హెక్టార్లలో ఉద్యాన పంటలు సాగు చేస్తున్నారని, మండలంలో 1,600–1,800 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరమవుతాయని అంచనా వేయటం జరిగిందన్నారు. ఇప్పటి వరకు చేబ్రోలు, నారాకోడూరులోని జీడీసీఎంఎస్, వేజండ్ల పీఏసీఎస్‌ల ద్వారా దాదాపు 1,200 మెట్రిక్ టన్నులు, ప్రైవేటు డీలర్ల ద్వారా 200 ట్రిక్ టన్నుల ఎరువులను సరఫరా చేయటం జరిగిందన్నారు. వ్యవసాయ ఖాధికారులు, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రైవేటు డీలర్లు, సొసైటీలను తనిఖీలు చేసినట్లు ఏవో ప్రియదర్శిని తెలిపారు.



జీడీసీఎంఎస్ పాయింట్‌లో యూరియా స్టాక్ వద్ద రైతులు, డీలర్లతో మాట్లాడుతున్న ఏవో ప్రియదర్శిని